మెడికల్ కిట్లకు నోచని అంగన్‌వాడీలు

- కూటమి ప్రభుత్వంలో సరఫరా కాని వైనం
- 7,989 మంది చిన్నారులకు అందని సేవలు


టెక్కలిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

టెక్కలి: అంగన్‌వాడీ కేంద్రాలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందనే విమర్శలు వస్తున్నాయి. పట్టణ, గ్రామ స్థాయిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెడికల్ కిట్లు, ఆట వస్తువులు లేకపోవడంతో ఆయా కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత ఇప్పటి వరకు పుస్తకాల సరఫరా చేయలేదు. ఇప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల్లో అత్యవసరమైన మెడికల్ కిట్లు లేకపోవడంతో చిన్నారులకు ప్రథమ చికిత్స విషయంలో జాప్యం చోటు చేసుకుంటోంది. కేంద్రాల్లో మందులు అవసరమైతే ఆరోగ్య కార్యకర్తలపై ఆధార పడాల్సి వస్తోంది. మరో వైపు చిన్నారులకు మానసికంగా ఎదుగుదలకు అవసరమైన సుమారు 25 రకాల ఆట వస్తువులు లేకపోవడంతో ఆయా కేంద్రాల్లో చిన్నారులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కిట్లు, ఆట వస్తువులు సరఫరా చేయాలని కోరుతున్నారు.

సౌకర్యాల కల్పనకు చర్యలు



అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం పుస్తకాలు సరఫరా జరిగాయి. మెడికల్ కిట్లు లేని చోట ఆరోగ్య సిబ్బంది నుంచి మందులు అందుతున్నాయి. మరి కొద్ది రోజుల్లో ఆట వస్తువులు అందుతాయి.

-బి.శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ

చిన్నారులకు అందని సేవలు...

టెక్కలి నియోజకవర్గంలోని ఐసీడీఎస్‌లో టెక్కలి, నందిగాం ఒక ప్రాజెక్టు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి కలిపి మరో ప్రాజెక్టుగా ఉన్నాయి. రెండు ప్రాజెక్టుల పరిధిలో 464 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 7,989 మంది చిన్నారులు ఉన్నారు. ఆయా కేంద్రాలకు నేటికీ మెడికల్ కిట్లు, ఆట వస్తువులు సరఫరా కాలేదు. వీరిలో ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల్లోపు చిన్నారులకు ఇంటికే పౌష్టికాహారం అందజేస్తారు. మిగిలిన మూడు సంవత్సరాలు దాటిన వారు కేంద్రాల్లో ఆట పాటలతో విద్యనభ్యసిస్తారు.

ప్రాజెక్టు	6 -3 సంవత్సరాల చిన్నారులు	3-6 సంవత్సరాల చిన్నారులు
టెక్కలి	4,099	2,249
కోటబొమ్మాళి	3,602	2,444

పరిసరాల పరిశుభ్రతే ధ్యేయం


ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం రూరల్: పరిసరాల పరిశుభ్రతే అందరి ధ్యేయం కావాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మండపల్లి, కేశుపురం, ఈదుపురం గ్రామ పంచాయతీలకు చెత్తను తరలించే ట్రాక్టర్లు మంజూరవ్వగా.. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండపల్లి పంచాయతీకి ట్రాక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం సమకూర్చుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, జనసేన సమన్వయకర్త దాసరి రాజు, మాజీ ఎంపీపీలు కారంగి మోహనరావు, దక్కత ఢిల్లీరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దక్కత నూకయ్యరెడ్డి, ఎంపీడీవో కె.రామారావు ఉన్నారు.

14న పలాస మండల సమావేశం

పలాస: పలాస మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వసంతకుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

సారా కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

నందిగాం: మండలంలోని హర్షబడ పంచాయతీ సాగరంపేటకు చెందిన సవర వెంకటేష్ మంగళవారం 20 లీటర్ల నాటుసారాతో పట్టుబడినట్టు నందిగాం ఎస్సై షేక్ మహ్మద్ ఆలీ తెలిపారు. ఇతన్ని అరెస్టు చేసి టెక్కలి కోర్టులో హాజరుపరచగా జడ్జి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

క్రిస్మస్ సందడి


చర్చిలో కేక్ కట్ చేస్తున్న మహిళలు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం నుంచి క్రిస్మస్ సందడి మొదలైంది. స్థానిక 12వవార్డు పల్లివీధిలోని జేఎస్‌ఎంబీ చర్చిలో మహిళలు కేక్ కట్ చేసి పంచిపెట్టుకుని సందడి చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. క్రీస్తు ఈ లోకంలో పాపులను కాపాడటానికి జన్మించాడని, అందుకే క్రీస్తు జననాన్ని ప్రపంచ మంతా పండుగ చేసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో చర్చి పరిధిలోని మహిళా సంఘ అధ్యక్షులు కృపారాణి, కార్యదర్శి కమల, ట్రెజరర్ మార్తమ్మ, నిర్మల, విజయ, బాలశ్రీ, జ్యోతి పాల్, రిబ్క రమేష్, ఆశ పాల్, జ్యోతి సురేష్, లావణ్య పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న కల్యాణచక్రవర్తి

పలాస: పలాస మండలంలో నీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా జరగడానికి అందరూ సహకరించాలని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి కోరారు. తన కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులు, సిబ్బందితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బుధవారం ఎన్నికల షెడ్యూల్ విడుదల అవుతుందని.. అందుకు అనుగుణంగా ప్రతిఒక్కరు నడుచుకోవాలని చెప్పారు. ఎన్నికల్లో పాల్గొనే వారికి నీటి తీరువా బకాయిలు ఉండరాదన్నారు. ముందుగా టీసీలను ఎన్నుకుంటారని, 14న అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని చెప్పారు. ఎంపీడీవో వసంతకుమార్, డీఈ బాబ్జీ, టీటీ త్రినాథ్, 14 నీటి సంఘాల పరిధిలోని ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి


సోంపేట: మాట్లాడుతున్న ఎస్‌ఐ హరిబాబు నాయుడు

సోంపేట: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలని బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు అన్నారు. మామిడిపల్లి ఉన్నత పాఠశాల ఆవరణలో సంకల్పం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి రూరల్: సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. కె.కొత్తూరు గ్రామంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టిసారించాలని అన్నారు.

మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం


నంజుండేశ్వర్‌ను సత్కరిస్తున్న మాజీ సైనికులు

పలాస: మాజీ సైనికులకు ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని తక్షణమే పరిష్కరిస్తామని ఆంధ్రా, తెలంగాణా ఏరియా డిప్యూటీ జీవోసీ బ్రిగేడియర్ ఎస్.వి.నంజుండేశ్వర్ చెప్పారు. పలాస మిలటరీ క్యాంటీన్‌ను మంగళవారం పరిశీలించారు. అనంతరం పలాస ప్రాంతానికి చెందిన మాజీ సైనికులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వితంతువులకు సంబంధించిన సమస్యలు ఉంటే తమకు తెలియజేస్తే పరిశీలించి సకాలంలో పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నంజుండేశ్వర్‌ను మాజీ సైనికులు సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం పలాస శాఖ అధ్యక్ష,కార్యదర్శులు ఇల్లా మన్మథరావు, ఇప్పిలి తాతయ్య, ఉపాధ్యక్షుడు బంగారు బారికి, బమ్మిడి బాబూరావు, ఉప్పాడ వెంకట్రావు, క్యాంటీన్ మేనేజరు టి.క్రిష్టారావు ఉన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సోంపేట: మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 181లో ఉన్న మెట్టభూముల్లో ఆక్రమణలు తొలగించాలని సీపీఐ, సీపీఎం నాయకులు తహసీల్దార్ బి.అప్పలస్వామిని కోరారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో సిరిమామిడి , మామిడిపల్లి పంచాయతీల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడిపల్లి పంచాయతీలో మెట్టభూములు ఆక్రమణలు తొలగించి ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని నాయకులు వినతి పత్రం అందజేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో పాతిన కృష్ణమూర్తి, సింహాచలం, పాపారావు ఉన్నారు.

మానవ హక్కుల గురించి తెలుసుకోవాలి


సోంపేట: నినాదాలు చేస్తున్న దృశ్యం


కాశీబుగ్గ: మాట్లాడుతున్న జడ్జి యూ.మాధురి

సోంపేట: మానవహక్కుల గురించి తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతీపౌరుడుపై ఉందని సోంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మానవహక్కుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. మానవ హక్కుల ఆవశ్యకతను వివరించారు. అధ్యాపక సిబ్బంది రజనికుమారి, రామినాయుడు,ఎం.ప్రసాద్, విద్యార్థులు ఉన్నారు.

మానవహక్కుల ఉల్లంఘన ఫిర్యాదులు పరిష్కరించాలి

కాశీబుగ్గ: మానవహక్కుల ఉల్లంఘనలపై వస్తున్న ఫిర్యాదులను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలాస మండల లీగల్‌సెల్ అథారిటీ చైర్మన్, పలాస జూనియర్ సివిల్ జడ్జి యూ.మాధురి అన్నారు. పలాస జూనియర్ సివిల్ కోర్టులో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా పలాస బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పిండి వెంకటరావు, ఫయాద్ అహ్మద్, జి ప్రభాకర్, కోత రజనీ, సీసీ నారాయణ పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న కృష్ణమూర్తిరెడ్డి

మానవహక్కుల పరిరక్షణకే ధ్యేయం

ఇచ్ఛాపురం: సమాజంలో జీవించే మానవుల హక్కుల పరిరక్షణకే మానవహక్కుల కమిషన్ ఏర్పాటైందని హ్యూమన్‌రైట్స్ నేషనల్ ఫెడరేషన్ కౌన్సిల్ ఇచ్ఛాపురం నియోజకవర్గం అధ్యక్షుడు డి.కృష్ణమూర్తిరెడ్డి అన్నారు. హ్యూమన్‌రైట్స్ డే కార్యక్రమాన్ని పట్టణంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రబీన్‌కుమార్‌పాఢీ మానవహక్కుల గురించి వివరించారు. ప్రభుత్వ బాలురు, బాలికల జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు జె.సాదయ్య, వి.శంకరరావు, నియోజకవర్గ హ్యూమన్‌రైట్స్ కార్యదర్శి ఎం.రాంబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.రామారావు, ప్రతినిధులు కె.చంద్రపూరి, తులసీరావు పాల్గొన్నారు.

గణితంపై భయాన్ని తొలగించాలి

ఇచ్ఛాపురం: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు గణితంపై భయాన్ని తొలగించాలని ఎంఈవో కె.అప్పారావు అన్నారు. స్థానిక పంజావీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ముందస్తుగా జాతీయ గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత ప్రాజెక్టులను ప్రదర్శించారు. గణితశాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్రపటానికి గణిత ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండలంలోనిని 50 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. చిన్నారులు వేసిన గణితరంగవల్లికలు అందరిని అలరించాయి. ప్రభుత్వోన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం, జెడ్పీహెచ్‌ఎస్ కొళిగాం హెచ్‌ఎం నరేంద్రనాథ్‌పట్నాయక్, పంజావీధి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ధనలక్ష్మి, ఎంపీయూపీ బి.తోటూరు హెచ్‌ఎం మల్లేశ్వరరావు, గణిత ఉపాధ్యాయులు తేజేశ్వరకుమార్ ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

ఇచ్ఛాపురం: హమ్మింగ్‌బర్డ్ ఒలింపియాడ్ సంస్థ వారు జాతీయస్థాయిలో నిర్వహించిన పోటీల్లో స్థానిక సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను యాజమాన్య ప్రతినిధులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సీఈవో జోహార్‌ఖాన్, ప్రిన్సిపాల్ ఐబీ పండా, హెచ్‌ఎం రషీదాసుల్తానా పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఐసీడీఎస్ ప్రాజెక్టుకు పుస్తకాలు రాక


ఐసీడీఎస్ కార్యాలయంలో పుస్తకాలు

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఐసీడీఎస్ ప్రాజెక్టుకు మంగళవారం కొత్త పుస్తకాలు చేరాయి. ప్రాజెక్టు పరిధిలోని పలాస, వజ్రపుకొత్తూరు మండలాలతో పాటు పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వీటిని సరఫరా చేస్తామని సూపర్‌వైజర్ లత తెలిపారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన


భూమి పూజ చేస్తున్న దృశ్యం

సోంపేట: కొర్లాం గ్రామంలో భూలోకమాత దేవాలయం నిర్మాణానికి శంకుస్థాపన, భూమి పూజను గ్రామకమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వేద పండితు పూర్ణచంద్రపాణిగ్రాహి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో పునఃనిర్మాణం చేపడుతున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మధ్యవర్తిత్వంతో కేసులు పరిష్కరించాలి


న్యాయవాదులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

సోంపేట: కోర్టుల్లో చాలాకాలంగా కొనసాగుతున్న కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కారం అయ్యేదిశగా ఆలోచించాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జె.శ్రీనివాసరావు న్యాయవాదులకు సూచించారు. స్థానిక కోర్టుల సముదాయంలో బార్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. జూనియర్ సివిల్ న్యాయమూర్తి ఎ.రాము, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.సర్వేశ్వరరావు, న్యాయవాదులు గోవిందరావు, ఎస్.విజయ్‌కుమార్, చలపతి, శ్రీనివాసరావు ఉన్నారు.

స్థలం ఉన్న ప్రతిఒక్కరికీ పక్కా గృహం


మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

వజ్రపుకొత్తూరు: సొంత స్థలం ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేస్తోందని గృహ నిర్మాణ శాఖ (పీఎంఏవై) సోషల్ డవలప్‌మెంట్ స్పెషలిస్ట్ చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక మండల వెలుగు కార్యాలయంలో మంగళవారం స్వయం శక్తి సంఘాల గ్రామైక్య సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సొంత స్థలం కలిగి, ఇల్లు లేని వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఈ పథకానికి అవసరమైన ధ్రువపత్రాలతో గ్రామ సచివాయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతీ లబ్ధిదారునికి రూ 2.77 లక్షలు మంజూరు చేస్తారని చెప్పారు. వివరాల కోసం 9949256501 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు టెక్కలిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం


టెక్కలిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి: నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ సత్తారు సత్యం కోరారు. మంగళవారం టెక్కలిలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెంబూరు రోడ్డులోని ఫ్లైఓవర్ వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రారంభోత్సవానికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా ఉదయం తొమ్మిది గంటలకు హాజరు కావాలని సత్యం కోరారు. సమావేశంలో కార్యకర్తలు ఆట్ల రవి, బల్ల కార్తీక్, బొడ్డ రాజేష్ ఉన్నారు.

తరలిరండి..

నందిగాం: టెక్కలిలో నూతనంగా ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమానికి నందిగాం మండల పార్టీ శ్రేణులు తరలిరావాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి ఓ ప్రకటనలో కోరారు.

మంచినీరు వృథా..



టెక్కలి బ్రహ్మణవీధి సమీపంలో పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. దీంతో మంచి నీరు వృథాగా పోతోంది. ఎర్రన్నాయుడు సమగ్రరక్షిత మంచినీటి పథకం నుంచి వచ్చే పైపులైన్ పాడవ్వడమే ఈ పరిస్థితికి కారణం. పైపులైన్ల పైనుంచి రోడ్డు వేశారు. దీంతో పైపులు పాడై నీరు జాతీయ రహదారిపై పారుతోంది. ఫలితంగా దిగువ ప్రాంతాలలోని కుళాయిల ద్వారా నీటి సరఫరా సక్రమంగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పైపులైన్లకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

-టెక్కలి రూరల్

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ..



ఎయిడ్స్ మహమ్మారిపై యువత అవగాహన కలిగి ఉండాలని సోంపేట మండలం బారువ సామాజిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బాలకృష్ణ అన్నారు. వైద్యసిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ బాధితుల హక్కులకు భంగం కలిగించవద్దన్నారు. ఎయిడ్స్ అంటువ్యాధికాదని అంటించుకనే వ్యాధన్నారు. కార్యక్రమంలో వైద్యులు దుర్యోధన, ఇందుసింహా, హేమం పాల్గొన్నారు.

-సోంపేట

ఆర్థికసాయం..



వజ్రపుకొత్తూరు మండలం దిబ్బవానిపేటకు చెందిన గండుపల్లి జగదీష్ విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో బోట్‌లో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సముద్రంలో పడిపోవడంతో మృతి చెందాడు. దీంతో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న సీ ఫేరర్స్ సేవా సమితి సభ్యులు రూ.52 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని మృతుని భార్య లక్ష్మికి మంగళవారం అందజేశారు. అనంతరం డబ్బులను ఇద్దరు పిల్లలు పేరున ఫిక్సిడ్ డిపాజిట్ చేయించారు.

-వజ్రపుకొత్తూరు

క్యాంటీన్ తనిఖీ..



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్న క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా సందర్శించారు. భోజనంలో నాణ్యతా ప్రమాణాలు, శుభ్రత, ఎంత మంది వస్తున్నారో ఆరా తీశారు. సంబంధిత రికార్డులను పరిశీలించిన అనంతరం భోజనం రుచి చూశారు. భోజనానికి వచ్చిన వారి నుంచి ఫీడ్ బ్యాక్ తెలుసుకోవడానికి ఫోన్ నంబర్లు సేకరించి ఆన్‌లైన్ చేస్తున్నట్టు కమిషనర్ చెప్పారు.

-కాశీబుగ్గ

విశాఖ ఉక్కును ప్రైవేటు పరం చేయవద్దు


బారువ తపాలా కార్యాలయం వద్ద పోస్టు కార్డులతో బీసీ వెల్ఫేర్ నాయకులు

సోంపేట: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయవద్దని బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బారువ గ్రామంలో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేయవద్దని కోరుతూ ప్రధానమంత్రికి పోస్టుకార్డులు పంపించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులను తొలగించడం అన్యాయమన్నారు. ఎందరో మహానుబావుల త్యాగాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను ప్రైవేటు పరం చేస్తే మరోసారి ఉద్యమం తప్పదన్నారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీన ఢిల్లీరావు, నాయకులు గేదెల దేవరాజ్, పల్లి హరిశ్చంద్ర, ఇరోతు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

పాముల కలకలం..


అలజడి సృష్టించిన రక్తపింజరి

కాశీబుగ్గ: పలాస పట్టణంలోని జనావాసాల్లో పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. సోమవారం సాయంత్రం ఎంపీడీవో కార్యాలయం రోడ్డులో ఉన్న ఐస్ ఫ్యాక్టరీ వద్ద భారీ రక్తపింజర పాము అలజడి సృష్టించింది. స్థానికులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పట్టుకుని రిజర్వు ఫారెస్టులో విడిచిపెట్టారు. అలాగే మంగళవారం రైల్వేస్టేషన్ ప్రవేశ ద్వారానికి ఆనించి ఉన్న ఓ పాన్‌షాపులో నాగుపాము చొరబడింది. వ్యాపారి సెల్‌ఫోన్ తీసేందుకు చేయిపెట్టగా అక్కడ పెద్దపాము కనిపించడంతో భయాందోళన చెందాడు.

పిల్లల ప్రవర్తనను గమనిస్తుండాలి

ఇచ్ఛాపురం రూరల్: చాలామంది పిల్లలు మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని, అటువంటి వారిపై తల్లిదండ్రులు దృష్టి పెట్టి మందలించాలని సీఐ మీసాల చిన్నంనాయుడు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మంగళవారం జగన్నాథపురం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పిల్లల ప్రవర్తనను కన్నవారు గమనిస్తుండాలని సూచించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు ఆశి మంధాకిని, ఆశి పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌సీ భార్యకు రూ. లక్ష సాయం

కాశీబుగ్గ: పలాస మండలం దానగుర గ్రామానికి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సవర జోక్యో ఈనెల రెండో తేదీన విధి నిర్వహణలో మరణించారు. దీంతో జిల్లా ఎస్పీ కె.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు అసోసియేషన్ తరఫున లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును మృతిని భార్య మేరికి మంగళవారం అందజేశారు. జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.కృష్ణంనాయుడు, ట్రెజరర్ భుజంగరావు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన ఉండాలి

టెక్కలి: వివిధ కేసుల పరిష్కారం విషయంలో మధ్యవర్తిత్వంపై అవగాహన ఉండాలని టెక్కలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజా చక్రవర్తి మల్లా సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.వివేకానంద, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు బానిసకావద్దు

టెక్కలి: యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని, మాదక ద్రవ్యాల జోలికి పోవద్దని ఎస్‌ఐ కె.రాము అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మదర్ థెరిసా జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.వెంకట్రావు, ఏబీవీపీ ప్రతినిధులు టి.ఆనందరావు, ఎస్.మదన్‌కుమార్, కె.మురళి ఉన్నారు.